
# ఫ్రీ

ఇచ్ఛాపురపు రామచంద్రం




పైవాళ్ళూ, పండగరోజులు. పెద్దవాడినని గౌరవం నటింపేసి నన్ను దూరంగా ఉంచి మగాళ్ళు వాళ్ళ మానాన వాళ్ళు పేక ముక్కలతో మునిగి తేలుతున్నారు. పెళ్ళికెళ్తూ పిల్లిని చంకబెట్టుకెళ్ళినట్టు తెలుగు సినిమాకెళ్తూ మగాణ్ణి తీసుకెళ్ళడమేమిటను కున్నారేమో! ఆడవాళ్ళు నన్నొది లేసి చక్కా సినిమాకి పోయారు.

అటు పెద్దరికం, ఇటు మగతనం. రెండు కారణాలుగా ఆ గదిలో నేనొక్కడినే మిగిలి పోయాను ఒంటిపిల్లి రాకాసిలా. నాకేమీ తోచ డం లేదు. మెలకువగా ఉన్నంతసేపూ భగవద్గీ తనో భాగవతాన్నో పట్టుకు కూర్చోగలిగేంత మరీ ముసలాడినేమీ కాను. కాలూ చెయ్యా ఆడుతూనే ఉన్నాయి. కన్ను కనిపిస్తూనే ఉంది. చెవి వినిపిస్తూనే ఉంది. బుర్రా బుద్ధీ పని చేస్తూనే ఉన్నాయి. సాయంత్రం వేళ ఇంట్లో ఒంటరిగా ఉండడం కంటే మరో శిక్ష ఉండ దేమో మనిషికి. ఏమీ తోచనప్పుడు ఇంటి కంటే వీధే పదిలమని నా అనుభవం. అదీకాక, ఈ వూళ్ళోనూ నా బాల్య మిత్రులూ సమ వయస్కులూ, ఉద్యోగ కాలంలోని మిత్రులూ నలుగురైదుగురు లేకపోలేదు. రోడ్డుమీదంటూ పడితే ఎవరైనా తగలకపోతారా అన్న ఆశా. భావం. పట్నం రోడ్డు ఒంటరికైనా చక్కని కాల క్షేపమే అనే నమ్మకం. రెండింటినీ ఆసరా చేసు కుని వాలు కుర్చీలోంచి తయారయ్యాను. చెప్పి వెళ్దామంటే ఆ పేకాటదాసులకి 'ఆసూ, కళా వర్ రాజూ' లాంటి మాటలు తప్ప మరేమీ విన పడే స్థితిలో లేరని గ్రహించి చెప్పకుండానే బయటపడి బజారెక్కాను. ఎటు చూస్తే అటే సందడీ, జనసందోహమూ. రోడ్లూ, దుకా ణాలూ, పేవ్‌మెంట్లు కూడా నిండిపోతున్నాయి మనుషులతో. సుఖంగా ఉన్న ప్రాణాన్ని చేతు లారా బాధపెడుతున్నానా అనిపించిందా గోలా, గందరగోళాలకీ.

అంతలోనే భూషణం నా భుజం మీద చెయ్యివేసి, ఆపి మరీ పలకరించాడు. కుశల

ప్రశ్నలయ్యాక కదలబోతున్నాం. భూషణానికి భాషణం అని పేరు పెట్టి ఉంటే సరిగ్గా సరిపో యేది. అతనొట్టి వాగుడు కాయ. ఆఫ్ చేయ దానికి అవకాశం లేని టీవీ. అతను తగిలి నందుకు నేను పెనం మీంచి పొయ్యిలో పడ్డానా అని భయపడుతుండగా రోడ్డుమీద పోతున్న ఎవరో ఎవరితోనో ఎవరి గురించో "వాడా! వాడు ఫ్రీగా వస్తే ఫినాయిలు కూడా తాగేసే రకం" అన్నారు.

"నిజంగా అలా తాగేవాళ్ళుంటారంటావా? అదేమన్నా కూల్‌డ్రింకా? కంపు కంపు. ఎంత కక్కుర్తిగాడయితే మాత్రం వట్టినే వచ్చిందని ఫినాయిలు తాగుతాడా? అతిశయోక్తీ, అబ ద్ధమూ అయి వుంటుంది" అన్నాను. నిజంగానే నాకు లోకజ్ఞానం తక్కువ. ఆ పైన పల్లెలాంటి చిన్న వూర్లో పుట్టాను. ఇప్పుడూ నివాసం అక్కడే. ఉద్యోగం చేసినన్నాళ్ళూ కూడా ఆఫీసూ యిల్లూ.. అదే ప్రపంచం.

"కాదు. నిజమే., ఫ్రీకి అంత శక్తి ఉంది. మనిషి చేత ఫినాయిలే కాదు పాయిజన్ కూడా తాగించగలదు"

"ఏమో! నాకయితే నమ్మకం చాలటం లేదు. సరదాగా వచ్చిందేమో ఆ మాట. బంగా రపు కత్తి అయితే మాత్రం పీక కోసుకుం టామా? అన్న పెద్దల ఉవాచ లేదూ?" అన్నాను.

"ఇప్పటి ప్రపంచం గురించీ, మనుషుల తత్వాల గురించీ నీకు తెలియదులే" అంటూ కదులుతూ – "నీకో విషయం తెలుసా?" అన్నాడతను ఏదో గొప్ప సత్యాన్ని చెప్ప బోతున్నట్లు.

"ఏమిటి?"

"అమెరికా మనకి భూతల స్వర్గమూ, అమెరికన్లు మనకి ఆరాధ్యదైవాలూ కదా ఇప్పుడు? దేనికైనా మనకి ప్రమాణం వారే. మన దృష్టిలో మనుషులంటే వాళ్ళే.. ఔనా?" అన్నట్లు చూశాడు నా వేపు.

"ఔనట. ఐతే?"

"అక్కడ మనవాళ్ళు కొందరు దోసెలమ్మి డాలర్లు దోచేసుకుంటున్నారు. దోసె ఖరీదు ఎనిమిదో పదో డాలర్లు అంటే కొంత అటూ యిటూగా మన లెక్కల్లో నాలుగు వందల రూపాయలు.

"దానికేముంది? పొరుగింటి పుల్లకూర రుచి. ఇండియన్ దోసె అమెరికాకి రుచి. కొత్తొక వింత కదా?"

"అది నిజమే కానీ కొంతమేరకే" చిరునవ్వు చిందించాడు, నా అజ్ఞానానికి జాలిపడు తున్నట్లు.

"మిగిలిన మేర ఏమిటి?"

"ఫ్రీ అనే బోర్డు. దోసెకి చెట్నీ ఫ్రీ – అని స్పష్టంగా కనిపించేట్లు. ఫ్రీ అన్నమాట పెద్దదిగా రంగులలో కొట్టొచ్చేలా పెడతారట."

"నారు పోసినవాడు నీరు పోశాడో, మానాడో! దోసె, చెట్నీల అనుబంధం భార తీయ భార్యాభర్తల అనుబంధంలా విడదీయ రానిది. చెట్నీ లేకుండా దోసె తినడం అసాధ్యం. దోసె ఇచ్చినవాడు చెట్నీ ఇచ్చి తీరాలి. అది రూలు" – "అని నీకు తెలుసు, నాకు తెలుసు. అమెరికన్లకేం తెలుసు?" చిద్విలాసం చిందించి – "తెలియడమంటే జ్ఞాపకం వొస్తోంది. ఓసారేం జరిగిందో తెలుసా?" అని అడిగాడు. ఈ మధ్య కాలంలో అతనికి శ్రోత దొరకనట్టుందనుకుంటూ "తెలి యదు" అన్నాను. అతనికింకేం కావాలి? చెప్పెయ్యసాగాడు.

"ఓ విదేశీయుడు టూర్ చేస్తూ మన విలేజికొచ్చాడు. అక్కడ కూజాలమ్ముతుంటే ఏమిటని అడిగాడు.

"జార్" అని చెప్పాడు ఇంగ్లీషు కొంచెం వచ్చినవాడు. బోర్లించి పెట్టబడిన కూజా మీద తడిమి – "దీనికి ఓపెనింగ్ లేదే. లోపలికి నీళ్లెలా పోస్తారు?" ఆశ్చర్యంగా అడిగాడు టూరిస్టు. అతనప్పుడు ఆ కూజాని మూతి మీదకు వచ్చేలా తిప్పి పెట్టాడు చూడమంటూ. విదేశీయుడు చేతితో ఆ కన్నాన్ని తడిమి "అరె! దీనికి బాటమ్ (అడుగు) కూడా లేదే! దీనిలో పోసిన నీరు ఎలా నిలబడుతుంది?" అన్నాడు మరింత ఆశ్చర్యపోతూ.

ఆ జోకు విని చాలాకాలం కావడంతో తాజాగా అనిపించి నేను నవ్వాను. అది చాలదూ భూషణం పుంజుకునేందుకు? నవ్వు నాలుగు జోకులని రప్పిస్తుంది కదా? అతను ఇంకొకటి మొదలుపెట్టాడు అవకాశం వదల కుండా. "ఒకసారేమైందో తెలుసా?"

"తెలుసు ఒకసారేమయిందీ ఇప్పుడేగా చెప్పావు కూజా కథ"

అతను రోడ్డు అని కూడా సంకోచించ కుండా గట్టిగా నవ్వేసి "నీకూ సెన్సాఫ్ హ్యూమర్ ఉందోయ్! సరే ఒకసారి కాదులే. ఇంకొకసారి ఏమయిందో తెలుసా?" అన్నాడు భుజం మీద చెయ్యేసి.

"తెలియదు కానియ్"

"తెలుసుకో. అవి కానీల కాలం కాదు. డాలర్ల కాలమూ, ప్రపంచీకరణ కాలమూ" అగాడు.

"చెప్పు" అని సర్దుకుని.. "ఏ కాలమైనా చెప్పుల (పాదరక్షల) కాలమేలే" అన్నాను, నడుస్తూనే.

"ఓ ఫారినర్ మనదేశం లోని ఓ పల్లెలాటి పట్నానికొచ్చాడు. ఆకలిగా ఉండి హోటల్లోకి వెళ్తే ఆ పా (కా)కా హోటలువాడు ఆకులో ఇడ్లీ వేసి యిచ్చాడు. చెట్నీ పోశాడు. అతను దానిని అమాంతం తినెయ్యబోతుంటే, పక్కవాడు ఆకును తినకూడదనీ దానిపై ఉన్నదే తినాలనీ సైగలతో బోధించాడు. అతనలాగే తిని ఆకుని పారేశాడు. సాయంత్రం వరకూ తిరిగి తిరిగి అలిసిపోయి, మళ్ళీ అలాంటి హోటల్‌కే

## దర్శకత్వం చేపట్టబోతోన్న నగ్మా!

'ఏందిబే ఎట్టాగా ఉంది ఒల్లు..?' అంటూ ఆంధ్రా జనాన్ని తన అంద చందాలతో బెదరగొట్టిన నగుమోము నగ్మా ఇప్పుడు సరికొత్త అవతారం ఎత్తబోతోంది. దర్శకురాలిగా ఓ తమిళ చిత్రాన్ని నిర్మించ బోతున్నట్లు బోగట్టా! కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొని ఆ పార్టీ



విజయానికి కృషి చేసిన నగ్మా రాజ్యసభకి వెళ్ళే అవకాశాలున్నట్లు కూడా తెలుస్తోంది. తమ పార్టీ విజయానికి కృషి చేసిన నగ్మాని రాజ్యసభ సభ్యురాలిగా పదవినిచ్చి ఆమెని సత్కరించాలని కాంగ్రెస్ వర్గాలు భావిస్తు న్నట్లు బోగట్టా!

వచ్చాడు విదేశీ. అక్కడ పూరీల మీద కూర వేసి ఇచ్చాడు హోటలు వాడు. కూర తినేసి పూరీలను ఆకులనుకుని పారేశాడు" అని నవ్వాడు భూషణం.

"దానికేముంది? తెలియనప్పుడు పొరపాట్లూ, గ్రహపాట్లూ జరుగుతుంటాయి. అతని దేశంలో ఇడ్లీలు పూరీలూ ఉండవు కనక అలా చేసి నవ్వులపాలయ్యాడు. కొంగా, నక్కా విందు కథలా వుంది" అన్నాను, వచ్చిన నవ్వు ఆపుకుని. ఈసారి కూడా నవ్వానో అతను మరీ చెలరేగిపోతాడు. అనకట్ట వెయ్యకపోతే అలా మాట్లాడుతూనే ఉంటాడు, స్విచ్ఛాఫ్ లేని టీ.వీ.లా.

రోడ్డు మీద జనంలోంచి నడుస్తున్నాం. నా ఖర్మ కాలి ఎవడో సెల్‌ఫోనులో మాట్లాడుతూ వస్తూ మమ్మల్ని గుద్దినంత పని చేసి.. సారీ అయినా చెప్పకుండా పోయాడు. వాడినేమీ చెయ్యలేక అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్లు –

"అమెరికాలో సెల్ ఇన్‌స్ట్రుమెంట్‌కి ఖరీదుండదు. ఫ్రీగా యిస్తారు. తరవాతే బిల్లులూ అవి." వాళ్ళబ్బాయి కొన్నేళ్ళు అమెరికాలో ఉన్నాడు. తనే ఉండి వచ్చినంత అధికారయుతంగా చెబుతాడు భూషణం. అవసరానికి వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకున్నట్లు..స్నేహితుడు కనకా, దొరికిపోయాను కనకా అతను చెప్పినవాటన్నిటికీ ఔనంటూ తలూపుతూ వినాలి. రోటిలో తల దూర్చాక రోకటిపోటుకి వెరచి ఏం లాభం?

"ఫ్రీ.. ఉచితం.. రిబేటు.. డిస్కౌంటు.. గిఫ్ట్.. ఒకటికి రెండు.. అది కొంటే యిది.. హంగామా.. బొనాంజా.. ఇవన్నీ ఆ తాను లోని ముక్కలే అనుకో. ఆ కుదురులోని పిలకలే. సూర్యం! నీకు మన రోజుల్లో వీటి రేట్లు జ్ఞాపకం ఉన్నాయా?" ఒకసారాగి "ఎనభై తొమ్మిది రూపాయల తొంభై తొమ్మిది పైసలు.. అలాగ" అంటూ చూశాడు.

"ఔను.. తొంభై రూపాయలు అనేవాడు కాదు. అలాగని ఓ పైసా యిచ్చిన పాపాన పోయేవాడు కాదు. ఆ మాత్రానికి తొంభై తొమ్మిది పైసలనడం ఎందుకూ అని తిట్టుకునే వాళ్ళం" బాటా రేట్లు జ్ఞాపకమున్నాయని నిరూపించాను.

"కానీ అమెరికాలో డాలర్‌లో సెంటు వందో వంతు, మన రూపాయలో పైసలా. ఐనా తొంభై తొమ్మిది సెంట్లంటేనే విపరీతంగా కొంటారు. ఐతే ఆ షాపులవాళ్ళు మన ఆర్టీసీ కండక్టర్లలా కాక, డాలరిస్తే ఖచ్చితంగా సెంటు తిరిగి యిస్తారు. ఒకరకంగా యీ సెంటు కూడా ఫ్రీలాటిదే. రిచ్‌కదా, సెంటు కోసం ఎందుకంత పాకులాడతారని అడిగితే అదంతే అంటారు. అమెరికన్లకి కూడా ఫ్రీ వీక్‌నెస్సే."




## మిస్ యూనివర్స్‌గా ఆస్ట్రేలియా సుందరి

ఈ సంవత్సరం విశ్వసుందరిగా ఆస్ట్రేలియాకు చెందిన సుందరి జెన్నిఫర్ హాకిన్స్ ఎన్నికైంది. పోటీలో పాల్గొన్న 80 మంది అందాల రాశులని కాదని జెన్నిఫర్ తన అందచందాలతో పాటు తెలివి తేటలు కూడా ప్రదర్శించి అందాల కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఈమె ఆస్ట్రేలియాకు చెందిన డ్యాన్సర్ కూడా. 5 అడుగుల 11 అంగుళాల ఎత్తున్న జెన్నిఫర్ తను విశ్వసుందరిగా ఎన్నికైనట్లు తెలియగానే ఆమె ఆనందానికి హద్దే లేకపోయింది. జూన్ రెండవ తేదీన క్విటో నగరంలో మిస్ యూనివర్స్ పోటీ ఉత్సవం జరిగింది.

పాలకోసం రాళ్ళు మొయ్యడమంటే ఏమిటో అనుభవపూర్వకంగా తెలిసివస్తోంది. ఇంటి దగ్గర సుఖాన ఉన్న ప్రాణాన్ని ఇతని బారిన పడేసి దుఃఖాన పెట్టుకుంటున్నాను. దేముడా, ఎప్పుడు చేసిన ఏ నేరానికి నాకీ శిక్ష? ఇంకా అసలు శిక్షేమిటంటే లోపల ఎంత ఉడికిపోతున్నా చిరునవ్వు నవ్వాలి. స్నేహితుడికి చిరాకు తెప్పించడమూ, చిన్నబుచ్చడమూ చేయకూడదు కనుక.

"అంచేత రాజకీయాలు, అవినీతి, లంచగొండితనాలలో ఈ ఫ్రీ వీక్‌నెస్.. ఉచితం కోసం బలహీనత. మానవాళి అంతటికీ అంటిందే. నేటి వ్యాపారానికి బ్రహ్మాస్త్రం ఈ బలమైన బలహీనతే. అదుగో చూడు" అని అటు చూపించాడు. చూశాను.

ఆ బట్టల షాపు ముందు పెద్ద బోర్డు మీద– తాటికాయంత అక్షరాలతోనూ.. రంగులతోనూ 80 శాతం డిస్కౌంట్ అనే ప్రకటన – చూసేవాళ్ళనాపి ఆకర్షించేలా, ఆకట్టుకుని అటు లాక్కునేలా. నేను నమ్మలేకపోయాను. ఎంత మానవ బలహీనమైతే మాత్రం మరీ ఇంత యిదా? కన్నుపోయేటంత కాటుక పెట్టుకుంటారా, ఎవరైనా?

"అంటే.. నూరు రూపాయల బట్ట ఇరవైకిస్తాడా? ఈ డొంకతిరుగుడు దేనికీ? ఇరవైకే యిస్తామంటే పోలా?" అమాయకంగా అడిగాను. పేద తట్టలు మోసేవారికి పూల బుట్టల గురించి ఏం తెలుస్తుంది?

"అదే వ్యాపార రహస్యం. నిజానికి షాపువాడికది పదిహేనుకంటే కూడా తక్కువకే గిడుతుంది. కానీ మన మీద ప్రేమకొద్దీ ఎనభై శాతం తగ్గించేస్తున్నట్లు నటిస్తూ మనని బుట్టలో వేస్తారు. అన్నట్లు అమెరికాలో విమానం టికెట్లకి ధర అనేది ఉండదు తెలుసా?" అని అడిగాడు హఠాత్తుగా గుర్తుకొచ్చినట్లు.

నాకెందుకీ అమెరికా గోల? జన్మలో నేను అమెరికా వెళ్ళి చచ్చేది లేదు. పనికిరాని పరిజ్ఞానంతో బుర్ర నింపుకోడం నాకిష్టముండదు. అయినా అడిగాను "రేటు అనేది లేకపోతే ఎలా? రైల్వే టైంటేబులు లేందే లేటు తెలియదే."

"అవతలివాడి అవసరాన్ని బట్టే ధర తెలుతుంది వేలం పోటీలోలా." కాబోలు అనుకున్నాను. వినదగునెవ్వరు చెప్పిన – పద్యం జ్ఞాపకం చేసుకున్నాను. పరాకుగా అటు చూశాను.

'ఒక షర్టు కొంటే బనీనూ, రుమాలూ ఉచితం. ఒక ప్యాంటు కొంటే అండర్‌వేరూ, కర్చీఫూ ఫ్రీ' బోర్డు మీద 'ఉచితం', 'ఫ్రీ'లు మెరిసిపోతూ.. మిడిసిపడుతూ. ఏవి కొంటే అవి ఇంకొకటి ఉచితం'.

నవ్వొచ్చింది. ఏడుపు వచ్చింది. "ఈ హైటెక్ రోజులలో కూడా కొనుగోలు దార్లు ఇంత అమాయకంగా పడిపోతారా? లాభం లేనిదే సెట్టి వ్యాపారం చెయ్యడని తెలియనిదెవరు?" అన్నాను.

"హైటెక్ రోజులు కనకనే ప్రజలని హైటెక్ పద్ధతుల్లో బురిడీ కొట్టించడం." నవ్వి - నడుస్తూనే -

"ఈ ఉచితం పిచ్చి ఈనాటిదేమీ కాదు. ఏనాటిదో.. చిన్నప్పుడు నేను విన్న కథ చెబుతాను, విను" అన్నాడతను. వినేవాడుం డాలే కానీ హరికథయినా చెప్పేస్తావని మనసులో అనుకుంటుండగానే నేను దాల్చిన మౌనాన్ని అంగీకారంగా తీసేసుకుని అతను చెప్పెయ్యసాగాడు.

"ఇది రూపాయల కాలంనాటి కథ కాదు. వరహాల నాటి కథ. గుర్రం.. మేలుజాతి గుర్రం.. మంచి తెల్ల గుర్రం పది వరహాలకే.. అంటూ ఊళ్ళో చాటింపు వేయించాడొకడు. ఎంత చచ్చు గుర్రమైనా ఐదు వందల వరహాలకి తక్కువకి దొరకని రోజుల్లో ఆ ప్రకటన విని జనం అమ్మకపు స్థలానికి పరుగెత్తుకు వచ్చారు, ఎవరికి వారే ఆ చవక బేరం కొట్టెయ్యాలని. అలా ఎందరో పోగయ్యారు. అక్కడ ఒక తెల్ల గుర్రం ఉంది. అది నిజంగానే మేలుజాతిదీ, అతి చక్కనిది. ఆ తెల్ల గుర్రం మీద నల్ల పిల్లి ఒకటి కూర్చుని ఉంది. అతను జనాలకి స్పష్టంగా చెప్పాడు. "గుర్రం ఖరీదు పది వరహాలే. కానీ గుర్రాన్ని విడిగా కొనుక్కునేందుకు వీలుపడదు. దానిమీదున్న పిల్లిని కూడా కొనాలి."

ఓస్ అదెంత? పిల్లి ఖరీదు మహా ఐతే ఓ వరహా అనుకున్నారు జనం. అప్పుడతను చావుకబురు చల్లగా చెప్పాడు, "పిల్లి ఖరీదు ఐదు వేల వరహాలు." ప్రజలు దిమ్మతిరిగి పడిపోయారు. "ఆ! పిల్లి ఖరీదు ఐదు వేలా? అన్యాయం.. దారుణం.." అరిచారు.

"పోనీ కావాలంటే గుర్రాన్ని ఉచితంగా ఇస్తాను. పిల్లి ఖరీదు మాత్రం వరహా తగ్గదు. తీసుకోదలుచుకుంటే రెండూ కలిపి మాత్రమే తీసుకోవాలి. పిల్లికి ఐదువేలిచ్చిన వారికి గుర్రం ఉచితం."

తెల్లమొహం వేసి వెళ్ళిపోయారు ప్రజలు. అందుచేత ప్రజలను అమ్మకపు వస్తువుల దగ్గరకి తీసుకు వచ్చేందుకు 'ఉచిత' మార్గాల నవలంభించడం ఎప్పటినుంచో ఉన్నదే. కాలానుగుణంగా ఆ మార్గాలు మెరుగుదిద్దుకుంటున్నాయంతే. తెలివితేటలుంటే మరింత నేర్పరితనంతో ఇతరులను వంచించడం అనే అర్థం వచ్చినట్లే."

అదే క్షణంలో ఎవడో మా ముందు ఆగి "ఆ మాట ముందే చెప్పేడిస్తే క్యూలో అంత సేపు కాళ్ళు నొప్పెట్టేలా నిలబడి చావక పోదునుగా" అని తనని తాను కసురు కుంటున్నట్లు.. స్వగతం కాస్తా పైకి అనేశాడు.

"ఏం జరిగింది?" అని భూషణం అడగడ మేమిటి, ఆ ఆసామీ మొరపెట్టుకున్నాడు.

"అటు చూడండి.. నలిగిపోయినవి, పోగులూడినవీ.. చీరయినా, షర్టయినా రూపాయే అని అక్కడుందా?" ఆ బట్టలషాపు ముందు కొండవీటి చేంతాడంత క్యూ ఉండడం ఎంత సత్యమో, టంగుటూరి మిరియాలంత (తాటికాయలంత) అక్షరాలతో 'చీరయినా షర్టయినా ఒక్క రూపాయే' అని ఉండడమూ అంత నిజమే.

"గంటలకొద్దీ క్యూలో నిలబడ్డాను, కాళ్ళు పీకుతున్నా నోరెండిపోతున్నా లెక్క చెయ్యక రూపాయికి నలిగినవో, కొట్టుచీకుడివో ఏదైతేనేం ఓ చొక్కా ముక్క వస్తుందని" -

"రాలేదా?" పుండు మీద కారం జల్లుతున్నట్లే, జాలి నటిస్తూ అడిగాడు భూషణం.

"వొచ్చింది చొక్కా కాదు కాళ్ళ పీకు. తీరా కౌంటర్ దగ్గరకి చేరాక ఒక్కొక్కటీ మూడు వందల చొప్పున రెండు కొంటేనే మూడోది రూపాయికిస్తాం అని ముక్కుమీద గుద్దినట్లు చెప్పాడు"

"అయ్యో మరి మీరేం చేశారూ?"

"ఏం చేస్తాను? స్థానబలం లేదు కనుక లాగి లెంపకాయ కొట్టలేక నన్ను నేనే తిట్టుకుంటూ వచ్చేశాను."

"పాపం.." మెత్తనివాళ్ళని చూస్తే మొత్తబుద్ధి .. ఎద్దు పుండు కాకికి నొప్పెట్టదు కదా? భూషణం ఆ అమాయకుడ్ని గిల్లీ ఏడిపించీ మరోసారి తాను శాడిస్టు అని నిరూపించుకున్నాడు. ఇతని బారిన పడడం ఒళ్ళు నొప్పులని గుర్రం చేత తన్నించుకున్నట్లే అని పశ్చాత్తాప పడుతూ అతనితో ముందుకు కదిలాను.


కొంచెం ఆధునికంగా ఉన్న మంగలి షాపు ముందు 'పండగ హంగామా! గెడ్డానికి క్షవరం ఫ్రీ'. అది దాటాక జోళ్ళషాపు. దానికి 'గ్రాండ్ రిడక్షన్ సేల్..బూట్లు కొంటే సాక్స్ ఫ్రీ. సాక్స్ కొంటే పాలిష్ ఫ్రీ' అని ద్వారానికి సరిపడా బోర్డు. అది దాటడమేమిటి అదేదో అడవాళ్ళ మేళాలాగే ఉంది.

"మీ పాత టీవీలు, ప్రెషర్ కుక్కర్లూ మాకిచ్చేసి మీరెంచక్కా కొత్తవి తీసుకెళ్ళండి" బోర్డుతోపాటు అరుపులు. "అల్లావుద్దీన్ అద్భుత దీపం కథ చదివి యీ టెక్నిక్ కనిపెట్టి ఉంటారు సేల్సు వాళ్ళు. కొత్తొక వింత, పాతొక రోత అని ఉండనే ఉందిగా. మనం పట్టుకెళ్ళిన కుక్కరు లేదా టీవీకి వాళ్ళు కట్టే ధర అతి స్వల్పం. అంచేత పేరుకే మార్పిడి కానీ దాదాపు కొత్తదానంత రేటూ చెల్లించ వలసిందే. ఐనా కొత్తంటే ఏదో బలహీనత"

"ఐతే ఓల్డిజ్ గోల్డ్ అనే దానికి కాలం చెల్లిపోయినట్లే అన్నమాట. మనుషుల విషయంలోనూ అంతే కాబోలు" అంటూ అటు చూసి నివ్వెరపోయాను. 'నూరు రూపాయలు పైన ఖరీదు చేసే ఇంజక్షను చేయించుకునే వారికి కాపడం రబ్బరు సంచి ఉచితం. పేషెంటుని తీసుకొచ్చినవారికి టానిక్ సీసా ఫ్రీ."

నాకు తల తిరిగిపోతోంది. విశ్వరూప ప్రదర్శన ఇస్తున్న 'ఫ్రీ' ని చూస్తుంటే అసహ్యమేస్తోంది.

"నేను ఇంటికి పోతాను భూషణం." అన్నాను నీరసంగా. నాకు ఉక్కిరిబిక్కిరిగా



ఊపిరాడకుండా ఉంది.

"సరే నడు" అంటూ సైడు రోడ్డుకి మళ్ళాడు. అక్కడ కూరగాయల బజారు పేవ్‌మెంటు మీద-

"కే.జీ కూరగాయలు కొన్నవారికి



రూపాయి ఆకుకూర ఉచితం. ఆకు కూర అక్కర్లేకపోతే టొమాటోలు కొసరు"

ఉచితం.. ఫ్రీ.. కొసరు.. మాటలు వింటేనే వొళ్ళు కంపరమెత్తిపోతోంది నాకు. "ఆ సందులోంచి పోతే?" అతను నవ్వాడు. "కౌగిలికి ముద్దు ఫ్రీ. రాత్రంతా బుక్ చేసుకుంటే పగలు ఫ్రీ. ఆ సందు అదీ!" ఛీ! అనుకున్నాను. ఎక్కడి నుంచో 'నూరు గ్రాముల వెండికి ఒక గ్రాము ఫ్రీ' "సేరు పూలు కొంటే ఒక గులాబీ పువ్వు ఫ్రీ" అరుపులు. 'రూపాయిచ్చి కారు తీసుకుపొండి', సైకిలు కొంటే చక్రం ఉచితం.'

రిక్షాలలో.. ఆటోలలో.. ప్రకటనలు. ప్రకటనలు ప్రకటనలు. ఫ్రీ ప్రకటనలు. వినలేక నడక వేగం పెంచాను. అక్కడ నుంచి ఆ ఫ్రీ నరకం నుంచి త్వరగా.. అతి త్వరగా పారిపోవాలని.

'లోన్ సర్వీసింగ్ ఫ్రీ' 'ఎయిర్ టైమ్ ఫ్రీ' గోల.

అప్పటికి ఒక ఖాళీ రిక్షా ఎదురొచ్చింది. "రండి బాబూ! ఒక్కరి చార్జీకే ఇద్దరినీ.. పండగ కన్సెషను."

భగవంతుడా అని నిట్టూర్చి గత్యంతరం లేక రిక్షాలో కూలబడ్డాను.

"నువ్వెళ్ళు నాకు పనుంది" అని భూషణం రిక్షావాడికి నన్నెక్కడ దింపాలో చెప్పి పోయాడు.

జన కాలుష్యంలోంచి..శబ్ద కాలుష్యం లోంచి.. వాతావరణ కాలుష్యంలోంచి.. రిక్షావాడు నన్ను నాకు తెలియని వీధులలోంచి లాగుతున్నాడు. మెల్లగా -

జనం పలచబడుతున్నారు. ప్రకటనల దృశ్యాలూ శబ్దాలూ తగ్గుతున్నాయి. నేను కొంచెం తేరుకుంటున్నాను. నాకు తెలిసిన రోడ్డు వచ్చింది. అక్కడ ప్రశాంతంగా ఉంది. మా యిల్లు అక్కడికి నడక దూరమే. రిక్షావాడిని పంపేసి, రోడ్డు పక్క తూము మీద కూర్చుందామనుకుంటుంటే మా పటాలం దిగింది.

"ఇక్కడున్నారేం?"

"ఇంట్లో తోచక షికారుకి వచ్చాను. సినిమా చూశారా?" అడిగాను. ఏదో ఒకటడగాలి కదా అని.

"ఆ వెళ్ళిందే అందుకు కదా!"

"ఫ్రీ ఏమిచ్చారు సినిమా చూసినందుకు?" అప్రయత్నంగా అడిగేశాను, అంతవరకూ ఆ మైకంలో మునిగి ఉండడంవల్ల.

"సినిమా చూసినందుకు ఫ్రీ ఏమిటి?" వాళ్ళు తెల్లబోయి, "మీకు పైత్యం చేసినట్లుంది. బి.పి. వచ్చింది. ఇంటికి పదండి. రెస్టు తీసుకుందురుగాని. ఒక్కరినీ వదలం" అంటూ బలవంతంగా నన్ను ఇంటికి ఈడ్చుకు పోయారు. రెస్టు పేరుతో ఒక గదిలో నన్ను అరెస్టు చేశారు. ముఖం కడుక్కుని నిమ్మకాయ నీళ్ళు తాగి శాంతంగా కూర్చునేసరికి ఏకాంతంలో నేను నిజంగానే మళ్ళీ మనిషినయ్యాను. మనిషిగా నా కర్తవ్యం గుర్తుకొచ్చింది.

గది కప్పునే ఆకాశంగా భావించి చేతులు జోడించాను.

"తిండి కల్తీ అయితే వచ్చే తెగుళ్ళ గురించి హెచ్చరించారు.

తాగే నీరు మలినమైతే కలిగే ముప్పుని విప్పి చెప్పారు.

పీల్చే గాలి దుర్గంధమైతే కలిగించే రోగాలను వివరించారు.

వాతావరణం కలుషితమైతే మానవాళికి జరిగే కీడుని మరీమరీ చెబుతున్నారు. మీకు చాలా కృతజ్ఞతలు. కానీ వీటన్నిటికంటే మనిషికి అతి ప్రమాదకరమైనవి భావకాలుష్యమని మీకూ తెలుసు. శీలం పోతే మనిషికి అన్నీ పోయినట్లే అని చెప్పనే చెప్పారు. మరి..ఓ మహానుభావులారా! ఎయిడ్స్ కంటే .. సార్స్ కంటే ఎంతో ప్రమాదకరమై ప్రపంచమంతా వ్యాపించిన ఈ 'ఫ్రీ కాలుష్యం' గురించి మనుషులని హెచ్చరిస్తూ.. నిర్మూలించడానికో, అదుపులో ఉంచడానికో, తక్షణం యుద్ధ ప్రాతిపదిక మీద చర్యలు ప్రారంభించి మానవజాతిని పెను ముప్పు నుంచి తప్పించరూ?" అని మనస్ఫూర్తిగా ప్రార్థించాను:

వృద్ధుడ్ని, ప్రార్థనకంటే ఏం చెయ్యగలను?

*

## కాపీ కొట్టడం నాకు చేతకాదు!

'మర్డర్' సినిమాలో మల్లికా షెరావత్ చేసిన పాత్రనే 'నో ఎంట్రీ' సినిమాలో బిపాసా బసు చేస్తోందని పుకార్లు వస్తున్న నేపథ్యంలో ఈ విషయం బిపాసా వద్ద కదిపితే 'ఎవరినో కాపీ కొట్టాల్సిన ఖర్మ నాకు లేదు. మర్డర్ కన్నా ముందు జిస్మ్‌లో నటించానన్న విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. ఎవరు ఎవరిని కాపీ కొట్టారో అందరికీ తెలుసు' అంటూ కస్సుబుస్సులాడింది బిపాసాబసు.